క్లుప్తంగా

ఆర్థికసాయం



కేసముద్రం : మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన చీపురు భిక్షపతి ఇటీవల మృతి చెందాడు. కేసముద్రం స్టేషన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2003–04 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థికసాయం, 2 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. అదే విధంగా కేసముద్రంవిలేజీకి చెందిన సుంకరబోయిన నాగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడి స్నేహితులు (10వ తరగతి) సోమవారం రూ.12వేల నగదు అందజేశారు.

21న స్పాట్ కౌన్సెలింగ్

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి నేడు కొత్తగూడెం మండలంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించనున్న స్పాట్ కౌన్సెలింగ్‌ను వర్షాల కారణంగా రద్దు చేస్తున్నామని గిరిజన గురుకులాల ఆర్సీ రత్నకుమారి సోమవారం తెలిపారు. కౌన్సెలింగ్‌ను ఈ నెల 21వ తేదీ (గురువారం) నిర్వహిస్తామన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మహబూబాబాద్/నెల్లికుదురు/పెద్దవంగర : సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్ ఆవరణలో, నెల్లికుదురు మండల కేంద్రంలో, పెద్దవంగరలో ఆ సంఘం మండల అధ్యక్షుడు గంగిశెట్టి రమేశ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే మహాధర్నా పోస్టర్లను నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యూరియా సరఫరా చేయాలి



గార్ల : మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వరినాట్లు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని, రైతులు పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు యూరియా చల్లుకోవాలంటే, గార్ల పీఏసీఎస్‌లో తప్ప, ఎరువుల దుకాణాల్లో ఎక్కడ యూరియా దొరకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎరువుల దుకాణాల్లో సైతం యూరియా లభించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి అలువాల సత్యవతి, కె.ఈశ్వర్‌లింగం, ఇమ్మడి గోవింద్, పెద్దవెంకటేశ్వర్లు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మేస్తున్న పిచ్చిమొక్కలు

- మరిపెడ–గిరిపురం రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మొక్కలు
- కనిపించని మలుపులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు



పిచ్చి మొక్కలతో మరిపెడ-గిరిపురం రోడ్డు



మలుపు వద్ద కనిపించని రోడ్డు

మరిపెడ : మరిపెడ నుంచి గిరిపురం వెళ్లే రోడ్డుకు ఇరువైపుల సుమారు రెండు కిలోమీటర్ల వరకు పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మూలమలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక, సూచిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరిపెడ నుంచి గిరిపురం వరకు రెండు కిలోమీటర్ల రోడ్డును ఆరేళ్ల క్రితం నిర్మించారు. మరిపెడలోని జాతీయ రహదారి 365కి అనుసంధానంగా ఉన్న ఈ రహదారిలో నిత్యం వాహనాలు వెళ్తుంటాయి. గిరిపురం మీదుగా వెంకంపాడు, బావోజిగూడెం, చిల్లంచర్ల, రాంపురం, ఆనేపురం, ఎలమంచలితండా, రూప్‌సింగ్ తండా, తాళ్లఊకల్ తదితర గ్రామాలకు నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. వర్షాకాలంలో రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు పెరగడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో వాహనాలు ముళ్ల పొదల్లోకి దూసుకెళ్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించి మెరుగున రవాణా సౌకర్యాన్ని కల్పించాలని వాహనదారులు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెన్నారం పెద్దచెరువు కట్టకు బుంగ




బుంగను పరిశీలిస్తున్న అధికారులు

డోర్నకల్ : మండలంలోని వెన్నారం శివారు పెద్దచెరువు కట్టకు బుంగ పడింది. భారీ వర్షాలతో తూము నుంచి కాల్వ నీరు వదిలేందుకు పైపులు ఏర్పాటు చేసిన భాగంలో కట్టపై మట్టి కుంగి బుంగ ఏర్పడింది. సోమవారం బుంగను గుర్తించిన రైతులు సమాచారం అందించడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పొక్లెయినర్‌తో బుంగను పూడ్చారు. వెన్నారం పెద్ద చెరువు కింద వెన్నారం, తోడేళ్లగూడెం, మంగళగూడెం గ్రామాల పరిధిలోని సుమారు 500 ఎకరాల భూములు సాగవుతున్నాయి. చెరువులో ప్రస్తుతం భారీగా నీరు ఉండగా కట్టకు గండి పడితే వరదతో మంగళగూడెం గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు సకాలంలో స్పందించడంతో ముప్పు తప్పింది. ఇరిగేషన్ డీఈ భద్రు, ఏఈలు కిషన్, హార్థిక, ఆర్ఐ యాసీన్, పంచాయతీ కార్యదర్శులు సంపత్, సాయితేజ, రైతులు రంజాన్, సుంకరి వెంకన్న తదితరులు కట్ట మరమ్మతు పనుల్లో పాల్గొన్నారు.

వాగుల పరిశీలన

మండలంలోని మున్నేరు, ఆకేరు వాగులను మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగుతో పాటు పలు గ్రామాల చెరువులను పరిశీలించి స్థానిక సిబ్బందితో పరిస్థితిపై సమీక్షించారు. తహసీల్దార్ ఇమ్మానియల్, ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, ఇరిగేషన్ డీఈ భద్రు నాయక్ పాల్గొన్నారు.

జాలువారుతున్న 'భీమునిపాదం'



గూడూరు : మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అడవిలోని భీమునిపాదం జలపాతం రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాలనురగల్లా జాలువారుతూ కనువిందు చేస్తోంది. ఓ వైపు వర్షం కురుస్తుండగా, పర్యాటకులు ద్విచక్ర వాహనాలు, కార్లలో జలపాతం వద్దకు చేరుకొని సందడి చేశారు. జలపాతం జాలువారుతుండగా ఎలాంటి సంఘటన తలెత్తకుండా ఫారెస్టు సిబ్బంది చర్యలు చేపట్టారు.

'ఏడుబావుల' జలపాతం వద్దకు పర్యాటకులు రావొద్దు

గంగారం : మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో గల ఏడుబావుల జలపాతం ప్రమాదకరంగా మారిందని, పర్యాటకులు రావొద్దని గంగారం రేంజర్ మంగీలాల్, ఎస్సై రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం జలపాతానికి వెళ్లే దారిపై ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. జలపాతం వద్ద లోతైన బావి ఉందని, అంతేకాకుండా వర్షాలకు కురుస్తుండడంతో పారుకువచ్చి జారిపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వర్షాలకు తగ్గేవరకు జలపాతం సందర్శనకు ఎటువంటి అనుమతులు లేవని, పర్యాటకులు గమనించాలని కోరారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

రేగొండ : కొన్ని రోజులుగా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు, కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు పట్టుకున్నారు. సీఐ కరుణాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన చర్లపల్లి శివ.. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కర్కపల్లిలో నివాసం ఉంటున్నాడు. శివ అతడి బావమరిది లింగబాబుతో కలిసి కొంత కాలంగా రేగొండ, నెల్లికుదురు, లింగాల, దమ్మన్నపేటతో పాటు పలు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్ వైర్, బావి వద్ద మోటార్లు, బైక్‌లను దొంగిలించారు. కాగా సోమవారం భాగిర్థిపేట క్రాస్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో దొంగిలించిన బైక్‌తో నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి నుంచి రెండు బైక్‌లు, రూ.75 వేల నగదు, 5 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు. బైక్‌లు, కాపర్ వైర్, మోటార్లు చోరీ చేస్తున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న రేగొండ ఎస్సై సందీప్ కుమార్, సిబ్బంది ప్రవీణ్, శ్రీధర్, కుమారస్వామిని సీఐ అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్



జీజీహెచ్‌లో బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెహ్రూసెంటర్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యకోసం తండాలు, గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచి రేవంత్ ప్రభుత్వం పేదలకు వైద్యం అందించేలా చర్యలు చేపట్టిందని, వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ఆర్థో విభాగంలో వైద్యసేవలు మరింత పెరిగేలా చూడాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవించిన బాలింతతో మాట్లాడి అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జయంతి వేడుకలు..

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, గౌడ సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

బయ్యారం : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించారని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని తులారాం ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్లు వచ్చే పనులపై పెట్టిన శ్రద్ధ రైతులకు ఉపయోగపడే పనులపై పెట్టలేదన్నారు. బయ్యారంలోని తులారాం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తే మహబూబాబాద్, ఇల్లెందు నియోజకవర్గ రైతాంగానికి మేలు కలుగుతుందన్నారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు

మహబూబాబాద్ : ఐసీడీఎస్‌లను బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సంపూర్ణ, స్నేహబిందులు డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకే అప్పగించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, దుర్గారావు, సులోచన, సంధ్య, నీల, లలిత, ఆండాళు, సరోజ, విజయ, పద్మ, సుజాత, మల్లికాంబ పాల్గొన్నారు.

బీజేపీ బలం పెరుగుతోంది

- మాజీ ఎంపీ సీతారాంనాయక్



పార్టీలో చేరినవారితో సీతారాంనాయక్

డోర్నకల్ : ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ప్రజలకు మేలు కలుగుతుండడంతో గ్రామాల్లో బీజేపీ బలం పెరుగుతోందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ సీతారాంనాయక్ తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం సోమవారం నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ.. కేంద్ర పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ బీజేపీకి ఆదరణ పెరుగుతుందని తెలిపారు. బీజేపీ నియోజకవర్గ నాయకుడు గుగులోత్ శంకర్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు గుగులోత్ దేవిక, ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, సీరోలు మండల అధ్యక్షుడు జోగి రమేష్, కార్యదర్శి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నెల్లికుదురు : మండల కేంద్రంలోని కేజీబీవీలో నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటర్ అగ్రికల్చర్ క్రాప్ కోర్స్‌లో ఉన్న 40 సీట్లకు పదో తరగతి పాసైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ సుమలత అన్నారు. 6వ తరగతిలో 20, 7వ తరగతిలో 10 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఇంగ్లిష్ బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీగా..

గంగారం : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లిష్ బోధించేందుకు సీఆర్‌టీ గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ పేర్కొన్నారు. బీఈడీ, టెట్ క్వాలిఫై అయిన మహిళా అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కేజీబీవీ గంగారంలో నేడు సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం..

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు: చెక్కులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

తొర్రూరు/పెద్దవంగర : పేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హెచ్‌జేఆర్ఆర్ ట్రస్టు తరపున పాలకుర్తి నియోజకవర్గంలోని 14మంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.4.84 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఝాన్సీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల విద్యకు అడ్డంకులు రావొద్దని ఝాన్సీరెడ్డి ఆర్థిక సాయమందిస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు. ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డిలపై నమ్మకంతో నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించారని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా అభివృద్ధి ఆపబోన్నారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్యానాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, నాయకులు పెదగాని సోమయ్య, అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పింగిళి ఉష, భూసాని రాము, తూనం శ్రావణ్, గుండాల నర్సయ్య, రామచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, జలగం శ్రీను, భిక్షంగౌడ్ పాల్గొన్నారు. అలాగే పెద్దవంగర మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి



నెహ్రూసెంటర్ : జిల్లాలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, భూ పోరాటంలో పేదలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో భూపోరాట నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. సమ్మెట రాజమౌళి, శైలజ, వెంకటమ్మ, మాధవి, సునీత, రజిని, వీరభద్రం, కృష్ణ పాల్గొన్నారు.

కుక్కల సమస్యను పరిష్కరించాలి

మహబూబాబాద్ : మున్సిపల్ పరిధిలో నెలకొన్న వీధికుక్కల సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. ప్రతీ వార్డులో కుక్కల దాడుల్లో పిల్లలు, వృద్ధులు గాయాల పాలవుతున్నారని, వాటిని ప్రత్యేక కేంద్రానికి తరలించాలని డిమాండ్ చేశారు. నాయకులు సమ్మెట రాజమౌళి, సీతారాం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. రేషపల్లి నవీన్, శ్రావణ్, అశోక్, చిరంజీవి పాల్గొన్నారు.

క్రయ, విక్రయాలను నిరోధించాలి

కొత్తగూడ : మండల కేంద్రంలో షెడ్యూల్ చట్టాలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్రయ, విక్రయాలను నిరోధించాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఈక విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనేతరులు భూముల కొనుగోలు చెల్లవని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి

డోర్నకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మండలంలోని గొల్లచర్లలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్రలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్, నాయకులు లాలూనాయక్, మేకపోతుల శ్రీనివాస్, ఆంగోత్ వెంకన్న, వెంకటేశ్వర్లు, రాజునాయక్, గొర్ల సత్తిరెడ్డి, తాళ్లూరి హనమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలి



తొర్రూరు రూరల్ : వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అందించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మాటేడు, పోలెపల్లి, పత్తేపురం గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పంచాయతీ కార్యదర్శులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు. సంఘం నాయకులు యాకయ్య, వెంకన్న, సత్తయ్య, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

వైద్యురాలికి ఆశ కార్యకర్తల వినతి

దంతాలపల్లి : పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి, తమకు రూ.18వేల జీతం ఇవ్వాలని మండల కేంద్రంలోని ఆశ వర్కర్లు సోమవారం వైద్యురాలు కవితకు వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్యశాలల ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ నెల 25న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. ఆశవర్కర్లు సైదమ్మ, పద్మ, విమల, పరమేశ్వరి, జ్యోతి, భద్రమ్మ, ఉమ, కవిత, అరుణ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతు చేయాలి

కేసముద్రం : మండలంలోని కాట్రపల్లి నుంచి కేసముద్రం వరకు వెళ్లే రోడ్డు గ్రానైట్ లారీల రాకపోకలతో అధ్వానంగా మారిందని వెంటనే మరమ్మతు చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలు తమ అవసరాలకు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారిందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డోర్నకల్ : పట్టణ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు. యాదవనగర్, బుద్దారం మార్గంలోని మామిడితోటలో పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసి వారి వద్ద రూ.5,080 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడులను ఖండించాలి



మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్రంలో మీ సేవల ఉద్యోగ, సిబ్బందిపై జరుగుతున్న దాడులను ఖండించాలని మీ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు దేశబోయిన అనిల్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆర్డీఓ కార్యాలయం రోడ్డులోని మీసేవ కేంద్రం వద్ద సోమవారం జిల్లాని మీసేవ నిర్వాహకులు నిరసన తెలిపారు. రాష్ట్రంతో పాటు పలు జిల్లాలో మీ సేవ కేంద్రాల ఉద్యోగ, సిబ్బందిలపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాము, అనిల్, శ్రీనివాసచారి, జానీ, నాగేంద్ర, అరుణ్, జనార్దన్, ఫణీ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్



పెద్దవంగరలో..



బయ్యారం: పాపన్నగౌడ్ విగ్రహం వద్ద..



ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

జిల్లావ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సోమవారం కల్లుగీత కార్మిక సంఘం, గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని పాపన్న విగ్రహానికి, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాపన్న స్ఫూర్తితో గౌడకులస్తులు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్, బీజేపీతో పాటు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తొర్రూరు: పాపన్న జయంతి వేడుకలో పాల్గొన్న గౌడ సంఘాల నాయకులు



తొర్రూరు: వెంకటాపురంలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘం నాయకులు



నెల్లికుదురు: మండల కేంద్రంలో..



గూడూరు: సీతానాగారంలో..



మహబూబాబాద్ అర్బన్: బీజేపీ కార్యాలయంలో..



చిన్నగూడూరులో..



మరిపెడ: గుండెపుడిలో..

ఫొటోగ్రఫీలో 'శంకర్'కు గోల్డ్ మెడల్

కురవి : మండలంలోని మొగిలిచర్లకు చెందిన ఎరబోయిన శంకర్‌కు జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో బ్లాక్ అండ్ వైట్ విభాగంలో బంగారు పతకం లభించింది. శనివారం రాత్రి విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ప్రపంచ గిరిజన దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ తుమ్మా శ్రీనివాస్‌రెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గంగరాజు తదితరుల చేతులమీదుగా శంకర్ అవార్డు అందుకున్నాడు.

షేక్ ఫకృద్దీన్‌కు ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు..

మరిపెడ : మరిపెడకు చెందిన ఆర్ట్ ఫొటోగ్రాఫర్ షేక్ ఫకృద్దీన్‌కు ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నాడు. ఏపీ సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ), ఫొటోగ్రఫి అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో అవార్డు అందుకున్నాడు.